


వామనావతారంతో గ్రామోత్సవం

అచ్చంపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలందుకున్న సీతానమేత శ్రీరామ చంద్రుడికి బుధవారం వామనావతారంతో గ్రామోత్సవం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 570.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,604 క్యూసెక్కులు వదిలారు.

మూలాంకురేశ్వరికి పూజలు



ఫిరంగిపురం: అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి ఆలయంలో బుధవారం విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

బాపట్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ @ 160



బాపట్ల: ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 160వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. 1865 జనవరి 1న బాపట్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభమైన సందర్భంగా బుధవారం సబ్ రిజిస్ట్రార్ ఎన్. జాన్‌మోహన్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాపట్లకు తరతరాల ఘన చరిత్ర ఉందని తెలిపారు. పెద్ద నగరాలలో లేని ప్రభుత్వ కార్యాలయాలు ఆనాడే ఇక్కడ ఉండేవని చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో పనుల నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వల్ల బాపట్ల పట్టణానికి బహుళ ప్రాచుర్యం కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి పి.సి.సాయిబాబు, వెలుగు ఏపీఎం దగ్గుబాటి సురేష్, సీనియర్ అసిస్టెంట్ జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి



బాపట్ల: నూతన సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం జిల్లా అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్‌ను కలసిన వారిలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్, ఆర్డీఓ గ్లోరియా తదితరులు ఉన్నారు.

వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు




తాడేపల్లి రూరల్ : శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ధనుర్మాస వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మంగళగిరి బాపూజీ విద్యాలయంలో 17వ రోజు 17వ పాశురాన్ని భక్తులకు ఆయన వివరించారు. అనంతరం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి స్వయంగా ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మనిషి ప్రవృత్తి, విధి విధానాలు, భగవంతునిపై ఉండవలసిన నిష్ఠ, ఏ విధంగా ఆచరణలో పెట్టాలో వివరించారు. 14 ప్రాంతాల నుంచి సుమారు 340 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారు. తర్వాత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి.

యార్డులో 44,245 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 40,208 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 44,245 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 13,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,800 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 47,476 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1,416 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు., బ్యాంక్ కెనాల్‌కు 168, తూర్పు కెనాల్‌కు 180, నిజాంపట్నం కాలువకు 34, కొమ్మమూరు కాలువకు 840 క్యూసెక్కులు వంతున వదిలారు.



బృందావన్ గార్డెన్స్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో క్యూలైనులో భక్తులు

నూతన ఆశలు

గుంటూరు జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. యువత, చిన్నారులు సందడిగా గడిపారు. పెద్దలు, మహిళలు ఆలయాలు, ప్రార్థన మందిరాలకు వెళ్లారు. కొంగొత్త ఆశలతో నూతన ఏడాదిలో అడుగుపెట్టారు. మరింత విజయవంతంగా ముందుకు సాగాలని తమ దైవాలను కోరుకున్నారు. ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలకు పెద్ద ఎత్తున నగరవాసులు వెళ్లారు. గుంటూరు నగరంలో కొత్త ఏడాది ఉత్సాహం బుధవారం అంతటా కనిపించింది.

సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



నార్త్ ప్యారీస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో క్రైస్తవ విశ్వాసులు

ఒక్క రాత్రి... రూ.10 కోట్ల కిక్కు!

- 31వ తేదీన రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 11 వేల కేసుల లిక్కర్, 3,500 కేసుల బీర్ల విక్రయాలు
- నిబంధనలు ఉల్లఘించి ఈవెంట్స్ నిర్వహణ
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులు



శ్రీ కన్వెన్షన్‌లో జరిగిన ఈవెంట్



నెహ్రూనగర్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబరు 31వ తేదీ రాత్రి ఉమ్మడి గుంటూరు జిల్లాలో మద్యం ఏరులై పారింది. వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, క్లబ్‌లు, ఈవెంట్స్‌లలో లిక్కర్ భారీగా తాగారు. ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం గత సంవత్సరం కంటే ఈ సారి మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 11వేలకు పైగా కేసుల(బాక్స్‌లు) లిక్కర్, 3500 కేసుల బీర్లు విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.10 కోట్ల విక్రయాలు జరిగాయని చెప్పుకోవచ్చు. గత సంవత్సరం న్యూ ఇయర్ వేడుకల్లో 10 వేల కేసుల లిక్కర్, 2 వేల కేసుల బీర్ల విక్రయాలతో రూ.9.20 కోట్ల ఆదాయం సమకూరింది. మామూలు రోజుల్లో ప్రతి రోజు రూ. 8.50 కోట్ల మద్యం విక్రయాలు జరిగితే.. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా అదనంగా రూ.1.50 కోట్ల విక్రయాలు జరిగాయి.

నిబంధనల ఉల్లంఘన

శ్రీ కన్వెన్షన్‌లో ఇండోర్ పర్మిషన్ తీసుకుని అవుట్ డోర్‌లో ఈవెంట్ నిర్వహించారు. ఈవెంట్‌లో టిక్కెట్ రూ.20 వేల వరకు వసూలు చేసి మద్యం ఏరులై పారించారు. కళ్యాణ మండపంలో ఈవెంట్ నిర్వహిస్తామని బయట పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో నిర్వహించడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఈవెంట్ చూసేందుకు భారీగా సదరు ప్రాంతానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ట్రాఫిక్ జాం అయింది. ఈ ఈవెంట్‌లో పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు. అవుట్ డోర్‌లో ఈవెంట్ నిర్వహణపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు మండిపడ్డారు. చిన్నారులు, మహిళలు ఉండగానే మందు బాబులు తాగుతూ తూగుతుండటంతో ఇబ్బందిపడ్డారు. దీనిపై ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



పట్టుబడిన మందుబాబులు

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మందుబాబులు పదుల సంఖ్యలో పట్టుబడ్డారు. ఫుల్లుగా మద్యం సేవించి బైక్‌ల మీద జోరుగా తిరుగుతూ జంక్షన్ పాయింట్ల వద్ద తోటి వాహనదారులను భయంభ్రాంతులకు గురిచేస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. మద్యం తాగి నడుపుతున్న వారి వాహనాలు సీజ్ చేశారు. వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నారు. మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో తూర్పు నియోజకవర్గంలో 19, పశ్చిమ నియోజకవర్గంలో 6 కేసులు నమోదయ్యాయి.

భార్య చేతిలో భర్త హతం



అమరేంద్ర మృతదేహం

నిజాంపట్నం: మద్యం ఓ పండంటి కాపురంలో చిచ్చు రేపింది. భార్యాభర్తల మధ్య గొడవలకు ఆజ్యం పోసింది. ఒకరు ప్రాణాలు కోల్పోయేలా చేసిన ఘటన నిజాంపట్నం మండలం కొత్తపాలెం పంచాయతీ పెద్దూరులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గోకర్ణమఠం గ్రామానికి చెందిన అమరేంద్రకు కొత్తపాలెం పంచాయతీ పెద్దూరుకు చెందిన అరుణతో 12 సంవత్సరాల కిందట వివాహమైంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతంలో హోంగార్డుగా పనిచేసిన అమరేంద్ర మద్యానికి బానిసై ఉద్యోగాన్ని కోల్పోయాడు. తాగి తరచూ భార్యతో గొడవలు పడుతుండేవాడు. ఏడాది కిందట అరుణ పిల్లలతో పెద్దూరుకు చేరుకుంది. మంగళవారం రాత్రి మద్యం తాగిన అమరేంద్ర భార్యపై దాడికి తెగబడ్డాడు. ప్రతిఘటించిన అరుణ .. అమరేంద్రను అడ్డుకునే క్రమంలో ఆమె చేతిలోని కర్ర అతని తలకు బలంగా తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

చిరుద్యోగులపై కూటమి కక్ష సాధింపు



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు



తహసీల్దారు కె. శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, కార్మికులు

- చేబ్రోలు పంచాయతీ ఉద్యోగులకు రాజకీయ వేధింపులు
- కొత్త సంవత్సరం తొలి రోజునే 12 మందికి ఉద్వాసన

చేబ్రోలు: కొత్త సంవత్సరం రోజున కూటమి ప్రభుత్వం చిరుద్యోగులపై ప్రతాపం చూపింది. సర్కార్ తీరుపై బాధితులు నిరసన వ్యక్తం చేసిన సంఘటన చేబ్రోలులో బుధవారం జరిగింది. చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీలో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిలో 12 మందిని బుధవారం నుంచి విధుల్లోకి రావద్దని పంచాయతీ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. గ్రీన్ అంబాసిడర్స్, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, నైట్ వాచ్‌మెన్, వాటర్ వర్కర్‌గా పనిచేస్తున్న మొత్తం 12 మంది టెండర్ వర్కర్స్‌కు ఉద్వాసన పలుకుతూ ఆదేశాలు ఇచ్చారు. అధికార పార్టీకి చెందిన నాయకుల రాజకీయ ఒత్తిళ్ల కారణంతోనే ఇలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. చేబ్రోలు గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 12 మంది కార్మికులను పనుల్లోకి రావాల్సిన అవసరం లేదని పంచాయతీ కార్యదర్శి కారసాల శ్రీనివాసరావు ఆదేశాలు ఇవ్వటంతో మేస్త్రి వారిని బుధవారం నిలిపివేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు గత 20 సంవత్సరాలుగా పార్టీలకతీతంగా, కరోనా విపత్కర సమయంలో కూడా ప్రజలకు సేవ చేశారు. అలాంటి వారిని విధుల నుంచి తీసివేయడంపై విమర్శలు వస్తున్నాయి. కార్మికులు ఉదయం విధులకు వెళ్లకుండా చేబ్రోలు మెయిన్ రోడ్డులోని లైబ్రరీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీగా వెళ్లి తహసీల్దారు కె. శ్రీనివాసశర్మకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కార్మికులను పనుల నుంచి తొలగించటం అన్యాయమన్నారు. వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ హనుమంతరావు, పొన్నూరు మండల కార్యదర్శి రమేష్ బాబు, సీపీఎం నాయకులు పల్లా ఆదిశేషు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు హరిబాబు, నారాయణ, యాకసిరి శ్రీను, రాఘవమ్మ, బి.అన్నపూర్ణ, బి.కరుణమ్మ, నక్క శైలజ, దీపిక, బూసి సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు. గురువారం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లనున్నట్లు నాయకులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నందునే వేటు

దీనిపై పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాసరావును 'సాక్షి' వివరణ కోరగా.. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటూ సరిగా పనిచేయకపోవటంతోనే 12 మంది వర్కర్స్‌ను తొలగించినట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు, నైట్ వాచ్‌మెన్‌లు, వాటర్ వర్కర్స్, గ్రీన్ అంబాసిడర్స్ వీరిలో ఉన్నారన్నారు. ఇప్పుడు ఉన్న వారిని కూడా సరిగా పనిచేయకపోతే తొలగిస్తామన్నారు. గత ఏడాది వర్కర్స్ కాలపరిమితి ముగిసిందని, అయినప్పటికీ కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

విదేశంలో వైద్య సీటు ఇప్పిస్తామని మోసం

- రూ.21.59 లక్షలు తీసుకుని బెదిరింపులు
- కన్సల్టెన్సీకి చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మల్లికార్జునరావు

గుంటూరు రూరల్: తక్కువ ఖర్చుతో విదేశాల్లో ఉన్నత విద్య అందిస్తామని రూ.21.59 లక్షల మేరకు మోసగించిన ముఠాలోని ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం నగరంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఫిలిప్పీన్స్‌లోని మెడికల్ కాలేజీల్లో సీటు ఇప్పిస్తామని నగదు తీసుకుని మోసం చేసిన రైట్ ఛాయిస్ జేఎస్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సల్టెన్సీ సంస్థకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ముగ్గురు వ్యక్తులను వట్టిచెరుకూరు పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. పల్నాడు జిల్లా గురజాల గ్రామానికి చెందిన శీలంనేని శ్రీనివాసరావు తన కుమారుడు అనిల్‌కుమార్‌ను మెడిసిన్ చదివించాలని కన్సల్టెంట్స్‌ను సంప్రదించారని తెలిపారు. ఈ క్రమంలో గుంటూరు నగరంలోని అరండల్‌పేట 6/2లో గల రైట్ ఛాయిస్ సంస్థ ఫౌండర్ డైరెక్టర్ కన్నా రవితేజను కలిశారన్నారు. బాధితుడి నుంచి రవితేజ సుమారు రూ.21.59 లక్షల నగదు కట్టించుకున్నారని తెలిపారు. కళాశాలకు ఆ మొత్తం చెల్లించకపోవడంతో శ్రీనివాసరావు నిలదీశారని చెప్పారు. నిందితులు ఆయనతోపాటు కుమారుడిని కూడా భయపెట్టారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వట్టిచెరుకూరు పోలీసులు కేసు దర్యాప్తు చేశారని చెప్పారు. ఏడుగురు నిందితులు ఈ మోసానికి పాల్పడ్డారని గుర్తించామని తెలిపారు. నిందితులను వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన కన్నా బాల రవితేజ, కన్నా బాల శౌరయ్య, పెరమలపల్లి లోహిత, వీరులపాడు మండలం జగన్నాథపురానికి చెందిన పార రవి కుమార్, మురుపాల గీతిక, నారాయణ పవన్‌కళ్యాణ్, పొలిమేర శివలుగా గుర్తించామని వెల్లడించారు. వీరిలో ముగ్గురు నిందితులు ఫిలిప్పీన్స్‌లో ఉంటూ కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. కన్న బాల రవితేజ, కన్నా బాల సౌరయ్య, పార రవి కుమార్‌లను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. పెరమలపల్లి లోహిత హైదరాబాద్ బ్రాంచ్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తూ ఫిలిప్పీన్స్‌కు వెళ్లొస్తున్నట్లు గుర్తించామని వివరించారు. ఫిలిప్పీన్స్‌లో ఉంటున్న మురుపాల గీతిక, నారాయణ పవన్ కళ్యాణ్, పొలిమేర శివలపైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఫీజుల పేరిట తీసుకున్న నగదును నిందితులు సొంతానికి వాడుకుంటూ, విద్యార్థుల పాస్‌పోర్ట్, వీసాలను వారి వద్దే ఉంచుకుంటున్నారని విచారణలో వెల్లడైందని డీఎస్పీ పేర్కొన్నారు. దీనిపై నిలదీస్తే తప్పుడు కేసులు పెడతామని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నిందితులు బెదిరిస్తున్నారని తెలిపారు. నిందితుల నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్ ఫోన్లు, ఒక పాస్‌పోర్టును సీజ్ చేశామని వివరించారు. నిందితులను అరెస్టుచేసిన వట్టిచెరుకూరు సీఐ రామానాయక్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు శేఖర్, ప్రకాష్ బాబు, ప్రసాద్, పోతురాజులను డీఎస్పీ అభినందించారు.

గిట్టుబాటు ధర కల్పనలో బోర్డు పాత్ర ప్రధానం

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయం సజావుగా సాగేలా చూడటం, పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, ఎగుమతులను ప్రోత్సహించడంలో పొగాకు బోర్డు ప్రధాన పాత్ర పోషిస్తోందని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబులు స్పష్టం చేశారు. గుంటూరు చుట్టుగుంటలోని రైతు భవన్‌లో పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత ప్రభుత్వ నియంత్రణలో పొగాకు పరిశ్రమ సమగ్ర అభివృద్ధి కోసం 1976 జనవరి 1వ తేదీన పొగాకు బోర్డు చట్టం 1975 ద్వారా పొగాకు బోర్డు స్థాపించడం జరిగిందన్నారు. ప్రపంచంలోనే పొగాకు ఉత్పత్తిలో చైనా తర్వాత భారతదేశం రెండో స్థానంలో, వర్జీనియా పొగాకు ఉత్పత్తిలో 4వ స్థానంలో ఉందని వెల్లడించారు. బ్రెజిల్ తర్వాత ముడి పొగాకు ఎగుమతి చేసే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉందని, పొగాకు ఎగుమతుల ద్వారా భారత ఖజానాకు గణనీయమైన విదేశీ మారకద్రవ్యాన్ని అందిస్తున్నాయని పేర్కొన్నారు. 2023–24లో భారత పొగాకు ఎగుమతుల విలువ రూ.12,005.89 కోట్లుగా నమోదైందని చెప్పారు. దేశంలో పొగాకు పరిశ్రమ సుస్థిరత కోసం పొగాకు బోర్డు అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. దేశీయ అవసరాలు, అంతర్జాతీయ ఎగుమతి డిమాండ్‌కు అనుగుణంగా వర్జీనియా (ఎఫ్‌సీవీ) పంట ప్రణాళిక తయారు చేయుట, ఉత్పత్తి నియంత్రణ చేపడుతున్నట్లు వివరించారు. బ్యాంకుల ద్వారా రైతులకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడంలో సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. పొగాకు బేళ్లను ఎలక్ట్రానిక్ వేలం ద్వారా నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తున్నామన్నారు. 2023–24లో కిలో పొగాకుకు సగటు ధర రూ.288.65లు లభించిందని తెలిపారు. 2023–24లో పొగాకు రైతులు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొన్నప్పటికీ, రైతుల సంకల్పం కృషి ఫలితంగా రికార్డు స్థాయిలో 215.35 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయిందన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్, పక్కన ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు

2023–24 సీజన్‌లో పొగాకు రైతులు రూ.6,313.58 కోట్లు ఆర్జించడం జరిగిందన్నారు. గత ఏడాది సగటు ధర రూ.225.73తో పోలిస్తే ఈ సీజన్‌లో కిలోకు సగటున రూ.62.92 పెరిగిందని గుర్తుచేశారు. అదనంగా పండించిన 76.84 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలకు జరిమానాలను మాఫీ చేయడం వల్ల 38,751 మంది రైతులకు రూ.184 కోట్ల మేర లబ్ధి చేకూరిందని వెల్లడించారు. 2024–25 సీజన్‌లో కూడా మెరుగైన ధర రాబట్టేందుకు శతవిధాలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించి, రైతులు, అధికారులు, వ్యాపారుల సలహాలు, సూచనలు స్వీకరించి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసి ముందుకు వెళ్తామని వారు పేర్కొన్నారు. అనంతరం జరిగిన బోర్డు వ్యవస్థాపక దినోత్సవంలో పలువురు ఉత్తమ రైతులు, అధికారులను సత్కరించారు.

ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్‌గా రామారావు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) విజయవాడ ప్రాంతీయ కార్యాలయ రీజినల్ డైరెక్టర్‌గా ఎం.రామారావు, జాయింట్ డైరెక్టర్‌గా ప్రణవకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈఎస్ఐ లబ్ధిదారుల కోసం ఆరోగ్య అవగాహన, ఆధార్ సీడింగ్ శిబిరాలను ఏర్పాటు చేసి, అవగాహన పెంచే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్మికుల సామాజిక భద్రత అవసరాలను తీర్చడం, మెరుగైన ఆరోగ్య సేవలను అందించడం, ప్రాథమిక ఆరోగ్య సేవలను పెంచడంపై దృష్టి పెడతామన్నారు. రాష్ట్రంలోని 54 లక్షల మంది చందాదారులకు ఈఎస్ఐ ఆస్పత్రులు, ఔషధ కేంద్రాల ద్వారా అధిక నాణ్యతతో వైద్య సేవలను అందించడంలో సహాయం చేస్తామన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **3,000**

మోడల్ ధర రూ. **2,500**

క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన జిల్లా ఉన్నతాధికారులు



గుంటూరు వెస్ట్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్‌కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహలు బుధవారం క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సర వేడుకలు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సిద్ధార్థ నగర్‌లోని ఆయన నివాసానికి పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు చేరుకుని ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాంబాబును సత్కరించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, దేవుని ఆశీస్సులు అందరికి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, పలు అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఏ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించినట్లు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నడిపినేని వెంకట్రావు, బొనిగల హైమారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఎన్‌టీఏ నాయకులు బీవీ నాగేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, గుంటూరు, పల్నాడు జిల్లా శాఖల అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖలీల్, కె.సాంబశివరావు, పి. సాయి విశ్వనాథ్, పి.లలిత బాబు, ఎస్.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

‘పచ్చ’నేత డైరెక్షన్‌లో సీఐ ఓవర్ యాక్షన్

- సివిల్ వివాదంలో ఉన్న ఇంటి వ్యవహారంలో జోక్యం
- అద్దెకు ఉంటున్న బాధితులపైనే దౌర్జన్యం, వేధింపులు
- ఇంటి ఆక్రమణకు యత్నిస్తున్న వ్యక్తికి అండదండలు
- వీఆర్‌వోల సమక్షంలో తాళాలు వేసి స్టేట్‌మెంట్ రికార్డు
- మళ్లీ ఇప్పుడు తాళాలు పగలగొట్టారని టీడీపీ నేత ఫిర్యాదు
- వెంటనే బాధితులపై కేసు నమోదు చేసిన సీఐ
- కోర్టు ఆదేశాలను పట్టించుకోని పట్టాభిపురం సీఐ తీరుపై విమర్శలు



సివిల్ వివాదంలో ఉన్న ఇంటిని డిసెంబర్ 31వ తేదీన ఆక్రమించే యత్నం చేస్తున్న అధికార పార్టీ నాయకుడు విజయ కిరణ్, అతని అనుచరులు (ఫైల్)

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని సాయిబాబా రోడ్డు శాంతినగర్ రెండవ లైన్‌లో ఓ ఇంటి విషయమై సివిల్ వివాదం కొనసాగుతోంది. కొన్ని రోజులుగా తెలుగు యువత అధికార ప్రతినిధి యనమల విజయ కిరణ్ ఈ ఇంటిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయనకు పోలీసులు అండగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పట్టాభిపురం సీఐ వీరేంద్ర తీరు వివాదాస్పదంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన గుంటూరు నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు సోదరి వజ్రకుమారి ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. అయినప్పటికీ ఇటీవల విజయ కిరణ్ ఇంటిని ఆక్రమించుకునే యత్నం చేశారు. ఈ సివిల్ వివాదంలో పట్టాభిపురం పోలీసులు జోక్యం చేసుకోవద్దని న్యాయస్థానం ఉత్తర్వులు సైతం ఇచ్చింది. వజ్రకుమారి 2008 నుంచి ఈ ఇంట్లో కుటుంబ సభ్యులతో అద్దెకు ఉంటున్నారు. డిసెంబర్ 22వ తేదీన విజయ్ కిరణ్ తన అనుచరులతో ఆటోలలో అక్కడకు వచ్చారు. ముఖాలకు మాస్క్‌లు ధరించిన యువకులు, మహిళలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నారని కూడా చూడలేదు. వజ్రకుమారి అనారోగ్యంతో బాధపడుతున్నారని కూడా చూడకుండా దురుసుగా వ్యవహరించారు. ఆమె కుమారుడు, కోడలు, మనవరాలు, కుమార్తెలను బయటకు పంపారు. దౌర్జన్యంగా ఇంట్లో ఉన్న సామాగ్రిని సైతం బయట పడేశారు. అంతటితో ఆగకుండా అద్దెకు ఉంటున్న వజ్రకుమారి కుటుంబ సభ్యులు ఉంటున్న గదుల్లో విజయ కిరణ్ అనుచరులు లోపల గడి పెట్టి ఆక్రమించుకునే యత్నం చేశారు. ఈ విషయం గురించి ప్రశ్నించిన బాల వజ్రబాబుతో డిప్యూటీ మేయర్ అని కూడా చూడకుండా పట్టాభిపురం సీఐ వీరేంద్ర దురుసుగా వ్యవహరించారు. నెట్టుకుంటూ జీపు ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో జిల్లా ఎస్పీ జోక్యం చేసుకోవడంతో వజ్రబాబును వదలి పెట్టారు. అదే రోజు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. డిసెంబర్ 22వ తేదీన సివిల్ వివాదంలో ఉన్న ఇంట్లో అక్రమంగా చొరబడిన వారిని వీఆర్‌ఓల సమక్షంలో బయటకు పంపించి స్వయంగా సీఐ వీరేంద్ర తాళాలు తెప్పించి రెండు గదులకు వేయించారు. తాళం చెవులను వీఆర్‌ఓలకు అప్పగించి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. డిసెంబర్ 31న ఇంటి తాళాలు తీసి ఉన్నట్లు గమనించి వజ్రకుమారి, ఆమె కుమారుడు కిరణ్, కోడలు వెళ్లారు. తాళాలు తీసి ఉండటాన్ని గుర్తించి పరిశీలించారు. సమాచారం తెలుసుకున్న విజయ కిరణ్ అనుచరులతో భారీ సంఖ్యలో చేరుకుని మళ్లీ వారిని బయటకు పంపించారు. ఇంటిని ఆక్రమించేందుకు యత్నం చేశారు. సివిల్ వివాదంలో ఉన్న ఈ కేసులో పోలీసులు జోక్యం చేసుకోవద్దని న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను సీఐ బేఖాతర్ చేస్తూ ఘటనాస్థలానికి వచ్చారు. తమ కుటుంబం పట్ల మళ్లీ దురుసుగా వ్యవహరించారని వజ్రకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. బాల వజ్రబాబు, వజ్రకుమారి, ఆమె కుమారుడు, కోడలు, కుమార్తెలు ఇంటి తాళాలు పగలగొట్టి ఆక్రమించే యత్నం చేశారంటూ డిసెంబర్ 31న పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో విజయ కిరణ్ పథకం ప్రకారం ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదైంది. ఈ ఘటన జరిగిన సమయంలో బాల వజ్రబాబు ఆ ఇంటి దరిదాపుల్లో కూడా లేరని వజ్రకుమారి వాపోతున్నారు. ఇంటి తాళం చెవులు సీఐ సమక్షంలో వీఆర్‌ఓలకు ఇచ్చినట్లు గుర్తుచేశారు. అయినప్పటికీ పోలీసు కేసు నమోదు చేయడంపై సీఐ వీరేంద్ర పక్షపాతం చూపిస్తున్న తీరు అర్థం అవుతోందన్నారు. మొదటి నుంచి సీఐ తమతో దురుసుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బాల వజ్రబాబు రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక అధికార పార్టీ నాయకుల డైరెక్షన్‌లో సీఐ వీరేంద్ర ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పాజోస్యులకు సాహిత్య పాథోనిధి పురస్కార ప్రదానం



సత్యనారాయణకు పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీ విద్యాభవన్ ఆడిటోరియంలో బుధవారం అజో–విభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు సాహిత్య పాథోనిధి పురస్కారాన్ని ప్రదానం చేశారు. సంస్కృతి సంగీత నృత్య సాహిత్య నాటక సంస్థ ఆధ్వర్యంలో జరగ్గా, ఆచార్య అనుమాండ్ల భూమయ్య సమగ్ర సాహిత్యం–సాహిత్య విమర్శ గ్రంథ ఆవిష్కరణ, అంకితం, శివధనుర్భంగం సాహితీ రూపక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రముఖ నాటక రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీవేత్త కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ సమగ్ర సాహిత్య విమర్శ గ్రంథాన్ని ఆవిష్కరించగా, రచయిత ఆచార్య అనుమాండ్ల భూమయ్య కావ్యాన్ని ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు అంకితం చేశారు. అనంతరం శివధనుర్భంగం సాహితీరూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. వాల్మీకిగా గురు సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్, గోన బుద్ధారెడ్డిగా ఆచార్య అనుమాండ్ల భూమయ్య, మల్లికార్జున భట్టుగా కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, బమ్మెర పోతనగా ప్రముఖ సాహితీవేత్త సీవీవీ.సత్యనారాయణమూర్తి, ఆతుకూరి మొల్లగా సాహితీవేత్త ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి, విశ్వనాథ సత్యనారాయణగా సాహితీవేత్త, ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, జంధ్యాల పాపయ్య శాస్త్రిగా ప్రముఖ సాహితీవేత్త అద్దంకి శ్రీనివాస్‌లు తమ పద్యగానాలతో అలరించాయి. సాహితీవేత్తలను సత్కరించగా, సంస్కృతి వ్యవస్థాపకులు సర్రాజు బాలచంద్రరావు, సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జిల్లా అధికారుల శుభాకాంక్షలు



జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో అధికారులు

గుంటూరు వెస్ట్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి జిల్లా అధికారులు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, డీపీఓ సాయికుమార్, డీఎస్‌ఓ కోమలి పద్మ, సీపీఓ శేషశ్రీ, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు కలెక్టరేట్ పరిపాలనాధికారి పూర్ణచంద్రరావుతోపాటు పలువురు అధికారులు కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛాలు అందించారు.

యర్రబాలెంలో యూబీఐ శాఖ ప్రారంభం

కొరిటెపాడు (గుంటూరు): ఖాతాదారుల సౌకర్యార్థం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను మరింత విస్తరించనున్నట్లు ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్ స్పష్టం చేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను మంగళగిరి మండలం యర్రబాలెంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యూబీఐ రీజినల్ హెడ్ జవహర్ మాట్లాడుతూ.. గుంటూరు రీజియన్‌లో ఇప్పటికే 27 శాఖలు ఉన్నాయని చెప్పారు. 28వ శాఖను యర్రబాలెం గ్రామంలో ప్రారంభించామని పేర్కొన్నారు. యూబీఐ ప్రత్యేకంగా ప్రీమియం కస్టమర్ల బ్యాంకింగ్ అవసరాలను తీర్చడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. బ్యాంక్ కస్టమర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థిని బలవన్మరణం

నాదెండ్ల: పదో తరగతి విద్యార్థిని ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. గణపవరం అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉండే పాటిబండ్ల నాగేశ్వరరావు, రాహేలు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. నాగేశ్వరరావు పొగాకు బ్యారన్ పనుల నిమిత్తం ప్రకాశం జిల్లా వెళ్లాడు. రాహేలు స్థానికంగా పొగాకు పనులకు వెళ్తుంది. వీరి పెద్ద కుమార్తె మంజు అలియాస్ నవ్య (16) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన నవ్య ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

జెడ్పీలో నూతన సంవత్సర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు కేక్ చేశారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రజలందరూ సుఖ, సంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇరువురికి కారుణ్య నియామకం కింద ఆఫీస్ సబార్డినేట్‌లుగా ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. అచ్చంపేట ఎంపీపీ కార్యాలయంలో కుంభ మణికంఠసాయి, అమరావతి ఎంపీపీ కార్యాలయంలో సేతురాం నాయక్‌లను నియమించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, ఏవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్ల నంబర్లు మార్పు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని పలు ప్యాసింజర్ రైళ్ల నంబర్లను ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి మార్పు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని కోరారు.

రైలు పేరు	పాత నంబరు	కొత్తది	రైలు పేరు	పాత నంబరు	కొత్తది
నాగిరెడ్డి పల్లి–మిర్యాలగూడ	07276	67775	రేపల్లె–గుంటూరు	07785	67250
మిర్యాలగూడ–నాగిరెడ్డిపల్లి	07277	67777	గుంటూరు–రేపల్లె	07786	67223
మంగళగిరి–గుంటూరు	07281	67247	రేపల్లె–గుంటూరు	07787	67234
తెనాలి–గుంటూరు	07282	67236	గుంటూరు–విజయవాడ	07788	57202
నంద్యాల–రేణిగుంట	07284	77211	కాచిగూడ–నడికుడి	07791	67779
రేణిగుంట–నంద్యాల	07285	77212	నడికుడి–కాచిగూడ	07792	67780
విజయవాడ–గుంటూరు	07464	67769	గుంటూరు–విజయవాడ	07864	67230
గుంటూరు–విజయవాడ	07465	67765	రేపల్లె–తెనాలి	07873	67224
నడికుడి–మాచర్ల	07579	57205	తెనాలి–రేపల్లె	07874	67231
మాచర్ల–నడికుడి	07580	57206	రేపల్లె– తెనాలి	07875	67232
విజయవాడ–గుంటూరు	07628	67229	తెనాలి–రేపల్లె	07876	67233
గుంటూరు–మాచర్ల	07779	57203	గుంటూరు–తెనాలి	07887	67235
మాచర్ల–గుంటూరు	07780	57204	తెనాలి–రేపల్లె	07888	67238
విజయవాడ–మాచర్ల	07781	67227	మార్కాపురం–తెనాలి	07890	67239
మాచర్ల–విజయవాడ	07782	67228	నడికుడి–మిర్యాలగూడ	07973	67778
విజయవాడ–గుంటూరు	07783	57201	మిర్యాలగూడ–కాచిగూడ	07974	67776
గుంటూరు–రేపల్లె	07784	67249	గుంటూరు–విజయవాడ	07976	67248

మహిళపై రాడ్‌తో వ్యక్తి దాడి

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు
- నిందితుడికి అండగా స్థానిక నాయకుడు
- మతిస్థిమితం లేదని పేర్కొంటూ రాజీ యత్నాలు



దాడిలో కాలికి తగిలిన దెబ్బలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

తాడేపల్లి రూరల్: బతుకు దెరువు కోసం వచ్చిన కుటుంబంపై ఓ వ్యక్తి రాడ్‌తో విచక్షణారహితంగా బుధవారం సాయంత్రం దాడి చేయడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. బాధితులు, వారి బంధువుల కథనం ప్రకారం.. యూపీ నుంచి వచ్చిన వీరేంద్ర ప్రసాద్ మౌర్య, గీతా మౌర్య దంపతులు పట్టాభిరామయ్య కాలనీలో ఉంటున్నారు. వీరేంద్ర ప్రసాద్ మౌర్య సీలింగ్ పనులు చేస్తుంటాడు. నూతన సంవత్సరం కావడంతో సాయంత్రం సమయంలో సరదాగా బయటకు వెళ్లేందుకు ఇంట్లో నుంచి దంపతులు బయటకు వచ్చారు. అదే సమయంలో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ‘మీరు ఇళ్లల్లో కూర్చోక రోడ్లపై ఎందుకు తిరుగుతున్నారంటూ’ రాడ్ తీసుకుని గీతా మౌర్యపై దాడికి పాల్పడ్డాడు. వీరేంద్ర ఆపేందుకు ప్రయత్నించగా అతడిపైనా దాడికి యత్నించాడు. వీరేంద్ర పారిపోయాడు. గీతా మౌర్యను కాళ్లపై వెనుక నుండి రాడ్‌తో కొట్టడంతో ఆమె అక్కడే కుప్పకూలిపోయింది. తర్వాత విచక్షణరహితరంగా పలుమార్లు రాడ్‌తో కొట్టి అక్కడి నుండి పరారయ్యాడు. నిందితుడి బంధువులు మాత్రం అతడికి మతిస్థిమితం లేదని, దాడి గురించి పట్టించుకోవద్దని, ఆసుపత్రికి వెళ్లండని ఉచిత సలహాలు ఇచ్చారు. తీవ్రంగా గాయపడిన గీత మౌర్యను వైద్య నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రెండు కాళ్లు, తుంటి భాగం, రెండు చేతులపై తీవ్ర గాయాలు అయ్యా యి. మతిస్థిమితం లేని వ్యక్తిని ఇంట్లో ఉంచకుండా మద్యం తాగించి రోడ్లపై తిరగనివ్వడమేంటని బాధితుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక నాయకుడు ఒకరు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోకుండా అడ్డుపడుతున్నట్లు తెలిసింది. నిందితుడికి మతిస్థిమితం లేదని, పొరపాటు జరిగిందని అంటూ బాధిత కుటుంబ సభ్యులతో రాజీ ప్రయత్నాలు చేస్తున్నాడు.

17 నుంచి జూట్ బ్యాగులు, మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 17వ తేదీ నుంచి జూట్ బ్యాగ్స్ తయారీ, 22వ తేదీ నుంచి మగ్గం వర్క్స్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ జీ.బీ.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. జూట్ బ్యాగ్స్ తయారీ 13 రోజులు, మగ్గం వర్క్స్ తయారీపై 30 రోజులు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు చిరునామాలో సంప్రదించాలని సూచించారు. 0863 – 233 6912, 97006 87696, 81253 97953, 99499 30155 ఫోను నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

డిఫెన్స్ మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ లత, ఇతర సిబ్బంది

నెహ్రూనగర్: ఆర్మీ లో డ్రైవర్‌గా పని చేసి రిటైర్ అయిన వ్యక్తి గుంటూరులోని మిలిటరీ క్యాంటీన్ నుంచి మద్యం కొనుగోలు చేసి బయట అధిక రేట్లకు విక్రయిస్తుండగా బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ 1 టౌన్ స్టేషన్ సీఐ బి.లత పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌కు చెందిన అన్నపురెడ్డి సాంబశివరెడ్డి ఆర్మీలో డ్రైవర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. కొంత కాలంగా మిలటరీ క్యాంటీన్‌లో తక్కువ రేటుకి మద్యాన్ని కొనుగోలు ఎక్కువ రేటుకు అమ్ముతున్నాడనే సమాచారం మేరకు బుధవారం బీఆర్ స్టేడియం వద్ద అరెస్టు చేశారు. అతని నుంచి 13 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు ఎండీ కాశీం షరీఫ్, తిరుమలేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం బస్తాలు సీజ్



పేరేచర్లలో సీజ్ చేసిన రేషన్ బియ్యం

మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలో బుధవారం రాత్రి రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. మేడికొండూరు పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు పేరేచర్ల సమీపంలోని దేవసేన రైస్‌మిల్లు సమీపంలో మేడికొండూరు ఎస్సై షేక్ ఖాజీ బాబు తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. 120 బస్తాల రేషన్ బియ్యంతో మినీ లారీలో దేవసేన రైస్ మిల్లుకు వచ్చిన డ్రైవర్ పోలీసులను చూసి లారీని వదిలి పరారయ్యాడు. మేడికొండూరు ఎస్సై ఖాజీబాబు అనుమానంతో లారీని తనిఖీ చేశారు. 120 బస్తాల రేషన్ బియ్యం గుర్తించారు. రేషన్ బియ్యంతోపాటు లారీని సీజ్ చేసి మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.